క్లుప్తంగా

విద్యతోనే ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న ఏఈ నాగభూషణం

కార్వేటినగరం: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సమగ్ర శిక్షణ అభియాన్ ఏఈ నాగభూషణం అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా కార్యక్రమానికి మంగళవారం ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ విద్యలో రాణించిన వారు జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోగలరని సూచించారు. విద్యకు పేదరికం అడ్డు కాకూడదని, ఇష్టపడి చదివిన వారికి సరస్వతిదేవి తోడు మెండుగా ఉంటుందన్నారు. పాఠశాలల్లోనే ఉన్న పాఠ్య పుస్తకాలతో పాటు గ్రంథాలయాల్లో లభించే అరుదైన గ్రంథాలను చదవడం వల్ల ప్రపంచ జ్ఞానం పెరుగుతోందని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటే రానున్న పోటీ పరీక్షల్లో అవలీలగా ప్రతిభ చూపించి రాణించగలరని తెలిపారు. విద్యార్థులకు గ్రంథాలయ పఠనం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శంకర్ బాబు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

ఆరేటమ్మ ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న వెంకటేష్, రమా దంపతులు

పుత్తూరు రూరల్: స్థానిక జెండామాను వీధికి చెందిన కె.వెంకటేష్, రమా దంపతులు మంగళవారం గ్రామ దేవత ఆరేటమ్మకు అర సవరం బంగారు ముక్కుపుడక, ఆలయ ఆర్చ్ నిర్మాణానికి రూ.25 వేలు నగదును విరాళంగా అందజేశారు. తన తల్లిదండ్రులు కందగడ్డల రాజేంద్ర ప్రసాద్, సుగుణల జ్ఞాపకార్థం విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

వైఎస్సార్ విగ్రహావిష్కరణ రేపు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం సమీపంలో డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు ఎంపీపీ నాగరాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు జరిగే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొంటారని చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

సారా విక్రేత అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సెబ్ అధికారులు

పుత్తూరు రూరల్: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, తిరుపతి డీటీఎఫ్ బృందం కలిసి సంయుక్తంగా మంగళవారం మండలవ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు. ఈ దాడిలో పుత్తూరు మండలం నందిమంగళం గ్రామానికి చెందిన ఏ.సుధాకర్(37) పుత్తూరు–నగరి రోడ్డులో సారాతో ఉండగా అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడుల్లో డీటీఎఫ్ సీఐ హేమంత్‌కుమార్, ఎస్‌ఐ నరసింహులు, పుత్తూరు ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

లారీ బోల్తా : ఒకరికి గాయాలు


చిన్నకనుమ మలుపు వద్ద బోల్తాపడిన లారీ

కార్వేటినగరం: మండలంలోని చిన్నకనుమ మలుపు వద్ద లారీ బోల్తాపడి ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. పచ్చికాపల్లె వద్ద నుంచి వరి బస్తాల లోడుతో తమిళనాడులోని పళ్లిపట్టుకు వెళ్తున్న ఓ లారీ చిన్నకనుమ మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న కొల్లాగుంట గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి కుమారు దేవాకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన దేవాను 108 వాహనంలో పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు,

తృటిలో తప్పిన పెను ప్రమాదం..

లారీ బోల్తాపడిన చిన్నకనుమ మలుపు కూత వేటులో 33 కేవీ విద్యుత్ స్తంభం ఉంది. అదుపు తప్పి బోల్తాపడిన లారీ కొంచెం ముందు పడి ఉంటే రోడు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనేది. దీంతో లారీలో ఉన్నవారితో పాటు అటుగే వెళ్లే వాహనదారులకు ప్రాణాపాయం కలిగేదని స్థానికులు చెబుతున్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

రాష్ట్రప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. ఖరీఫ్ పంటల సాగుకు అన్ని విధాలుగా సాయం అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా పంటల సాగుకు వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఆర్థికసాయం అందిస్తోంది. అలాగే గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తన, ఎరువులను సబ్సిడీపై పంపిణీ చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు.

- పుత్తూరుకు చేరిన 107.7 మెట్రిక్ టన్నుల ఎరువులు
- జనుము 240, జీలగ 100 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం
- రెండు రోజుల్లో రానున్న 600 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు
- ఆర్‌బీకేల్లో సబ్సిడీ ధరలతో పంపిణీ చేస్తున్న అధికారులు



పుత్తూరు మండలంలోని వేపగుంట రైతు భరోసాకేంద్రం

పుత్తూరు రూరల్: పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. డివిజన్ పరిధిలో పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట, రామచంద్రాపురం మండలాలు ఉన్నాయి. డివిజన్ మొత్తం మీద ఖరీఫ్‌లో సాధారణ సాగులో వరి పంట 909 హెక్టార్లు కాగా, వేరుశనగ 760 హెక్టార్లు, చెరకు 1,226 హెక్టార్లుగా ఉంది. మండలాల వారీగా రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం తనవంతు సాయం అందిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సేవలను రైతులు తమ ఊర్లోనే రైతుభరోసా కేంద్రాల ద్వారా చేరవేస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల పంటల సాగుకు అవసరమైన వివిధ రకాల ఎరువులతో పాటు వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీతో అందిస్తున్నారు. వేరుశనగ విత్తనాలను 40 శాతం సబ్సిడీతో ఇవ్వనుండగా, పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు, జనుము 50 శాతం సబ్సిడీతో ఇస్తున్నారు. వివిధ రకాల ఎరువులను, వ్యవసాయ పనిముట్లు, ఇతర ఉత్పత్తులను సైతం సబ్సిడీ ధరలతో ఆర్‌బీకేల ద్వారా అధికారులు అందజేస్తున్నారు.


వడమాలపేట ఆర్‌బీకేలో రైతులకు యూరియాను పంపిణీ చేస్తున్న వీఏఏ దివ్య


వేపగుంట ఆర్‌బీకేలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

పుత్తూరు డివిజన్‌లో ఖరీఫ్ సాధారణ సాగు (హెక్టార్లలో)

మండలం పేరు	వరి	వేరుశనగ	చెరకు
పుత్తూరు	128	78	223
నారాయణవనం	165	59	227
వడమాలపేట	183	288	161
రామచంద్రాపురం	433	335	615
మొత్తం	909	760	1226

పుత్తూరు వ్యవసాయ డివిజన్‌కు వచ్చిన ఎరువులు, విత్తనాల వివరాలు

మండలం	ఎరువులు మెట్రిక్ టన్నుల్లో	జనుము (క్వింటాళ్లలో)	జీలగ (క్వింటాళ్లలో)	వేరుశనగ (క్వింటాళ్లలో)
పుత్తూరు	13.5	100	---	---
నారాయణవనం	9.0	---	---	---
వడమాలపేట	35.5	100	50	---
రామచంద్రాపురం	49.7	40	---	600
మొత్తం	107.7	240	50	600

ఎలాంటి ఇబ్బంది లేదు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎరువులు, విత్తనాలకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఇప్పటికే అవసరమైన మేరకు వివిధ రకాల ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు, జనుములు డివిజన్‌కు వచ్చేశాయి. ఆర్‌బీకేల ద్వారా సబ్సిడీ ధరలతో రైతులకు అందజేస్తున్నాము. అలాగే రామచంద్రాపురం మండలానికి సంబంధించి 600 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మరో రెండు రోజులు రానున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచడానికి వ్యవసాయ తరపున తీవ్రంగా కృషి చేస్తున్నాం.

– ఆర్.రమేష్‌రాజు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, పుత్తూరు



గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కార్వేటినగరం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కనికాపురం గ్రామానికి రూ.4 లక్షలతో ఏర్పాటు చేస్తున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు ఏర్పాటు చేయడంలో విఫలమైందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగేళ్లలోనే ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, బీటీ రోడ్లు ఏర్పాటు చేసి బస్సు సౌకర్యాలు కల్పించిన ఘనత కూడా తమ ప్రభుత్వానికే చెందుతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు లేక జనం ఇబ్బంది పడ్డారన్నారు. ఇన్నేళ్లుగా కలగా మిగిలిపోయిన రోడ్డును ఎంపీపీ నిధులతో గ్రామస్తులకు ఉపయోగపడేలా నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏఈ సుగుణాకర్, సర్పంచ్ శీలారాణి, ఎంపీటీసీ విమల, మాజీ ఎంపీటీసీ జేమ్స్, ప్రభాకర్‌రెడ్డి పలువురు ఉన్నారు.


గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న బాలాజీ

ఈకేవైసీ సర్వేను వేగవంతం చేయండి

విజయపురం (నగరి): ఈకేవైసీ సర్వేను వేగవంతం చేయాలని ఈఓపీఆర్‌డీ బాబు తెలిపారు. మంగళవారం శ్రీహరిపురం సచివాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులకు ఎస్‌డీజీ (సుస్థిరాభివృద్ధి) సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో 0–5 ఏళ్లు, 6–18 ఏళ్ల వయసున్న పిల్లలతో పాటు గర్భిణుల ఈకేవైసీ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. పిల్లల ఆరోగ్యం, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, లబ్ధిదారులకు అవసరమైన సామగ్రి అందించాలని సూచించారు.

అధిక పాల దిగుబడిపై అవగాహన

పాలసముద్రం: పోషక విలువలు కలిగిన పదార్థాలను పాడి పశువులకు అందించడం ద్వారా అధిక పాల దిగుబడి సాధ్యమని పశువైద్యాధికారి యశస్వి తెలిపారు. మంగళవారం మండలంలోని పాలసముద్రం సచివాలయ ఆవరణలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా పాడి రైతులకు పశువుల పెంపకం, ఆరోగ్యరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. పోషక విలువలు కలిగిన మినరల్ మిక్చర్ వాడడం వల్ల పశువులు త్వరగా ఎదకు వస్తాయని చెప్పారు. హార్మోన్ల సమతుల్యతా లోపం ఉండదని, దూడల ఎదుగుదల బాగుంటుందని తెలిపారు.9 పశువులకు కృత్తిమ గర్భధారణ, 15 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్స చేశారు.

వైభవంగా కొలుపు మహోత్సవం

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజు కుప్పం పంచాయతీ కన్నికాపురం గ్రామంలో వెలసిన బాటగంగమ్మ తల్లికి వార్షిక కొలుపు మహోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ప్రతి ఇంటి నుంచి పొంగళ్లను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారి ఆలయ ఆవరణలో పెట్టి నైవేద్యంగా సమర్పించారు. మల్లెపూలతో గెరిగను అలంకరించి ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. గెరిగ ఊరేగింపు సమయంలో కళాకారులు నృత్యాలు చేస్తూ కోలాటాలతో అలరించారు.

రామకృష్ణకు నివాళి


రామకృష్ణ యాదవ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులలరిస్తున్న కుమారస్వామిరెడ్డి

విజయపురం (నగరి): మండలంలోని చిన్నజంబాడకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామకృష్ణయాదవ్ (55) అనారోగ్యంతో మృతి చెందాడు. మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు కుమార్‌స్వామిరెడ్డి, స్థానిక నాయకులు మంగళవారం గ్రామానికి వెళ్లి రామకృష్ణయాదవ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కోసలనగరం గ్రామానికి చెందిన మురళి తల్లి నాగభూషణమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపీనాథ్, నాయకులు శేఖర్ రాజు, శివరాజు, చెంచుప్రసాద్, భరత్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య

నగరి: బడిఈడు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలంటూ మునెప్పనాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పవన్ కుమార్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రైవేటు స్కూళ్లలో కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ స్కూల్లో విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదిగిన వారి గురించి తెలియజేస్తూ ప్రేరణ కల్పించారు. పేరెంట్ కమిటీ చైర్మన్ భువనేశ్వరి, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, మహిళా పోలీసు రజని, టీచర్ ద్రాక్షాయణి, వలంటీర్లు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

బైకుల వేలంతో ఆదాయం


బైక్‌లను వేలం వేస్తున్న ఏఈఎస్ అయేషాబేగం

కార్వేటినగరం: బైకుల వేలంతో రూ.1,97,900 ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అయేషాబేగం తెలిపారు. మంగళవారం కార్వేటినగరం ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో ద్విచక్రవాహనాలను వేలం వేశారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పాలసముద్రం, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో అక్రమంగా సారా తరలిస్తూ పట్టుబడిన 5 బైక్‌లను వేలం వేయగారూ.1,97,900 ఆదాయం వచ్చిందని, ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఖజానాలో జమ చేస్తామన్నారు. అదేవిధంగా అక్రమ మద్యం వ్యాపారాలపై ఉక్కుపాదం మోపి 97 శాతం నిర్మూలించామన్నారు. ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఎస్‌ఐలు జయశంకర్, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణకు కృషి చేద్దాం


పాలసముద్రంలో ..

పాలసముద్రం : గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా అరికట్టితే డెంగీ వ్యాధి నుంచి ప్రజలను కాపాడుకోవచ్చని వైద్యాధికారి మోహన్‌కృష్ణ అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరం వస్తే ఎవరూ అశ్రద్ధ చేయవద్దని, వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అనంతరం ఆరోగ్యకేంద్రం నుంచి మండలకేంద్రం వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


నిండ్రలో..

నిండ్రలో..

నిండ్ర: డెంగీ ప్రబలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి కల్యాణి, సుమలత అన్నారు. మంగళవారం నిండ్రలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

విజయపురంలో..

విజయపురం (నగరి) : పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని శ్రీహరిపురం పంచాయతీ కార్యదర్శి బాబు తెలిపారు. మంగళవారం గ్రామంలో పర్యటించి పరిసరాల శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

వైభవంగా గంగజాతర


అభిషేక జలం తీసుకెళ్తున్న భక్తులు

నగరి : మున్సిపల్ పరిధిలోని కరకంతాపురం గ్రామంలో బుధవారం గంగజాతర వైభవంగా జరిగింది. వేకువజామున గంగమ్మను ఊరేగింపుగా తెచ్చి వేపాకు గుడిసెకు చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వీధినాటకాలు, నృత్యాలు స్థానికులను అలరించాయి. జాతరను పురస్కరించుకుని ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ సమీపం నుంచి భక్తులు అభిషేక జలాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆ అభిషేకం జలంతో అమ్మవారిని అభిషేకించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వెయ్యి కన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. తడిదుస్తులతో అంగప్రదక్షిణం చేశారు. అత్యధిక సంఖ్యలో భక్తులు వేపాకు సారెలు సమర్పించడానికి బారులు తీరడం ప్రత్యేకతను సంతరించుకుంది. అంగప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు గంగమ్మకు నైవేద్యం సమర్పించి కర్పూర హారతులు స్వీకరించారు.


వేపాకు సారె కోసం బారులు తీరిన భక్తులు

గంగమ్మకు ప్రత్యేక పూజలు


బొమ్మన్‌దొడ్లలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వెదురుకుప్పం: తిరుపతి గంగ జాతరను పురస్కరించుకుని మండలంలోని బొమ్మన్‌దొడ్ల, పచ్చికాపల్లం దాసరి కాలనీ, కోణంగిపల్లె, ఎర్రగుంటపల్లె, సద్దికూళ్లపల్లె గ్రామాల్లో గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పట్టు పీతాంబరాలు, పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. మహిళలు పెద్దఎత్తున అంబలి పోసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం ఆలయాల వద్ద పొంగళ్లు పెట్టి విశేష పూజలు చేశారు. భక్తులు భక్తిప్రపత్తులతో అమ్మవారిని కొలిచారు. యువత బాణసంచా కాల్చి సందడి చేశారు.

బాధితులకు అండగా ఆర్థికసాయం

వడమాలపేట : మండల పరిధిలోని ఏఎంపురం ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రమణ్యం (అలియాస్ ఎర్రబ్బ), శ్రీవిద్య మామిడి కాయలు కోసేందుకు వెళ్లి ట్రాక్టర్‌లో ఇంటికి వెళ్తుండగా బోల్తా పడడంతో గతవారం మృతి చెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా వారి కుటుంబాలకు బాసటగా నిలవాలన్న ఉద్దేశంతో మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి వెళ్లి వారి ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు చొప్పున కర్మక్రియలకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత్‌కుమార్ భారతి, సచివాలయాల కన్వీనర్ సురేష్‌రాజు, వడమాలపేట సింగిల్‌విండో డైరెక్టర్ సుబ్రమణ్యంరాజు, నాయకులు సుబ్రమణ్యంరాజు, ఉమాపతి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను చల్లగా చూడాలి..

వడమాలపేట : గంగమ్మ దేవత ప్రజలను చల్లగా చూడాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. మంగళవారం ఏఎంపురంలో గంగమ్మ జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గంగమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రంలో మంచి వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. రైతులు పంటలు పండించుకుని ఆనందంగా ఉంటున్నారని అన్నారు. గంగజాతర రోజున వర్షం కురవడం శుభసూచకం అన్నారు. సర్పంచ్ లలిత్‌కుమార్ భారతి, సచివాలయాల కన్వీనర్ సురేష్‌రాజు, వడమాలపేట సింగిల్‌విండో డైరెక్టర్ సుబ్రమణ్యంరాజు, నాయకులు సుబ్రమణ్యంరాజు, ఉమాపతి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

వాడవాడలా గంగజాతర

కార్వేటినగరం: తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకుని మంగళవారం పలు గ్రామాల్లో జాతరను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాలను వేపాకు తోరణాలతో అలంకరించి అమ్మవారికి ప్రీతిపాత్రమైన అంబలిని నైవేద్యంగా పెట్టారు. అలాగే పాదిరికుప్పం, కార్వేటినగరం పెద్ద దళితవాడ గ్రామాల్లో వచ్చేవారం జరిగే జాతర సంబరాలకు మంగళవారం రాత్రి చాటింపు వేశారు. మేజర్ పంచాయతీ కార్వేటినగరం బీసీ కాలనీలో వెలసిన కొల్లాపురమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి పురవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. అలాగే కార్వేటినగరం గ్రామ దేవతగా విరాజిల్లుతున్న శ్రీబంగారమ్మ ఆలయంలో అమ్మవారికి మహిళలు పొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా పురవీధుల్లో అమ్మవారి ప్రతిమలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.


ప్రత్యేక అలంకరణలో కొల్లాపురమ్మ అమ్మవారు

క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యటన


ఉపాధిహామీ కూలీలతో చర్చిస్తున్న ఏపీడీ శోభన్‌బాబు

కార్వేటినగరం: కూలి సరిగా రావడం లేదని ఉపాధి హామీ కూలీలు సోమవారం మండలకేంద్రంలోని ఉపాధిహామీ కార్యాలయం ఎదుట నిరసన తెలపడంపై ఉన్నతాధికారులు స్పందించారు. నగరి క్లస్టర్ ఏపీడీ శోభన్‌బాబు, ఎంపీడీఓ మోహన్‌మురళితో పాటు ఏపీఓ జాహ్నవి, జేఈ మధుబాబు కలసి పాదిరికుప్పంలో ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించారు. అనంతరం నగరి క్లస్టర్ ఏపీడీ మాట్లాడుతూ కూలీలు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు పని చేసినప్పుడే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. రోజువారి కూలి కనీసం రూ.272 వచ్చేలా పనులు చేపట్టాలని ఆదేశించారు. పని గంటలను మొబైల్ ద్వారా ఎన్‌ఎంఎంఎస్ హాజరు విధానంపై కూలీలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా కూలీలను గ్రూపులుగా విభజించి వారిలో విద్యావంతులను, సెల్‌ఫోన్‌పై అవగాహన ఉన్నవారిని గుర్తించి అందులో 20 మందికి ఒక మేట్‌ను నియమించాలని సూచించారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్‌ను వేరే పంచాయతీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ ఎప్పుడూ జరగకుండా చూడాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

అందుబాటులో జనుము, జీలుగ

విజయపురం (నగరి) : రైతులకు అవసరమైన జనుము, జీలుగ (పచ్చిరొట్ట) అందుబాటులో ఉన్నాయని ఏఓ రజినికుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనుము 40, జీలుగ 10 క్వింటాళ్లు ఉన్నాయని పేర్కొన్నారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను స్థానిక ఆర్‌బీకేలో అందజేయాలని సూచించారు. ప్రతి రైతుకు సబ్సిడీపై వీటిని అందజేస్తామన్నారు. వివరాలకు స్థానిక ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలని కోరారు.